అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 31 జులై 2023
1

గురుకుల పరీక్ష కేంద్రాల ఏర్పాటు సవరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలోని గురుకులాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఇతర జిల్లాల్లో సెంటర్లు కేటాయించారని వాటిని సవరించాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఆసీఫ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురుకులల్లో ఖాళీ పోస్టుల కోసం భర్తీ చేసిన ఒక అభ్యర్థికి వివిధ పరీక్షల కోసం మూడు జిల్లాల్లో పరీక్ష కేంద్రం కేటాయించడం దారుణం అన్నారు. దీనివల్ల అభ్యర్థులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిని వెంటనే సవరించి ఒకే జిల్లాలో కేంద్రాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురుకుల పరీక్షల సమయంలోనే గ్రూప్-2 ఉండడం వల్ల సన్నద్ధం అయ్యేవారికి ఇబ్బందిగా మారిందన్నారు. నిరుద్యోగుల అభ్యర్థన మేరకు గ్రూప్-2 పరీక్షను వాయిదా వేయాలని కోరారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

కాగజ్‌నగర్ : భారత్ బచావో కార్యక్రమంలో భాగంగా ఈ నెల 31న కాగజ్‌నగర్‌లోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు కార్యక్రమ జిల్లా ఇన్‌ఛార్జి ఎన్ రాజన్న తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని పాలకులు సంపదను కార్పొరేట్లకు దోచి పెడుతూ ప్రజలను మరింత పేదరికంలోకి నెట్టేస్తున్నారని అన్నారు. ఫాసిస్టు విధానాలతో ముందుకు పోతున్న పాలకులకు వ్యతిరేకంగా నిలబడుతున్న దేశభక్తులను అనేక విధాలుగా వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. వీటన్నింటిని అధిగమించేందుకు భారత్ బచావో కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశానికి భారత్ బచావో వ్యవస్థాపకులు గాదె ఇన్నయ్య హాజరు కానున్నట్లు తెలిపారు. దీనికి అన్ని రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు, కర్షకులు, కార్మికులు, విద్యార్థి, మహిళా, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు హాజరు కావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నాయకులు అల్లి రాజయ్య, బావండ్లపల్లి నర్సయ్య, జయదేవ్, ఇస్తారు పాల్గొన్నారు.

పట్టువీడని కార్మికులు..పరేషాన్‌లో పల్లెలు..!

- కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల పోరాటం
- గ్రామాల్లో అస్తవ్యస్తంగా మారిన పారిశుధ్యం
- సీజనల్ వ్యాధుల ప్రభావంపై ఆందోళన

పంచాయతీ కార్మికులు పట్టువీడటం లేదు. తమ డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు సమ్మె బాట వీడేదిలేదని స్పష్టం చేస్తున్నారు. దీంతో పల్లెల్లో పారిశుధ్యం పరిస్థితి అస్తవ్యస్తంగా మారుతోంది. రోజువారీ పారిశుధ్య పనులు ఆగిపోవడంతో అపరిశుభ్రత తాండవిస్తోంది. గత 25 రోజులుగా కార్మికులు సమ్మెలో ఉండటంతో పల్లెల్లో పారిశుధ్య పనులు నిలిచిపోయాయి. అధికారులు తాత్కాలిక సిబ్బందిని నియమించి పనులు చేయిస్తున్నామని చెబుతున్నా..అన్ని గ్రామాల్లో కనిపించడం లేదని తెలుస్తోంది. దీంతో రోడ్లు, మురుగుకాల్వలు, డంపింగ్‌యార్డులు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. పది రోజులుగా కురిసిన వర్షాలకు పారిశుధ్యం మరింత అస్తవ్యస్తంగా మారింది. ఈ క్రమంలో సీజనల్ వ్యాధులు మరింత ప్రబలేందుకు ఆస్కారం ఏర్పడుతోందని పల్లెవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ పారిశుధ్య కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుండటం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోపక్క కొన్ని చోట్ల సర్పంచులు, పంచాయతీ అధికారులు కార్మికులకు మద్దతు పలుకుతుండగా.. మరికొన్ని చోట్ల బెదిరింపులకు పాల్పడుతున్నట్లు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు అంటారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన గ్రామాలను అనునిత్యం పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికులది కీలకమైన పాత్ర. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన పల్లె ప్రగతి



కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పనులన్ని కార్మికులే చేస్తుంటారు. ఉదయం నిద్ర లేచిన నుంచి పల్లెల పరిశుభ్రత కోసమే పరితపిస్తుంటూ అంటు వ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త పడుతున్నారు. కానీ వారి పట్ల ప్రభుత్వం నిరంకుశ వైఖరి అవలంభిస్తోందని కార్మికులు చెబుతున్నారు. చాలీచాలని వేతనంతో అధిక పనిభారం మోస్తూ పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. గత 25 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రావడం లేదు. విధులు బహిష్కరించి ఆయా మండల కేంద్రాల్లో కార్మికులు నిరసన చేపడుతున్నారు.

25రోజులుగా కొనసాగుతున్న సమ్మె..!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 3వేల మందికి పైగా కార్మికులు పనిచేస్తుంటారు. ప్రభుత్వం వీరికి నెలకు రూ.9500 వేతనం అందజేస్తోంది. ఉదయం నుంచి సాయంత్ర వరకు పల్లె పరిశుభ్రతలోనే నిమగ్నమవుతున్న కార్మికులు ఇతర పనులకు వెళ్లలేని పరిస్థితి. దీంతో ప్రభుత్వం అందించే ఈ వేతనం కార్మికుల కుటుంబ పోషణకు ఏ మాత్రం సరిపోవడం లేదు. మరోపక్క నిత్యావసర సరకుల ధరలు పెరగడంతో వీరికి వచ్చే వేతనంతో వాటిని కొనుగోలు చేయలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో కార్మికులకు రూ.26వేల వేతనంతో పాటు ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, మల్టిపర్పస్ విధానాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నారు. వీటి సాధన కోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సమ్మె చేపడుతున్నారు.

అస్తవ్యస్తంగా పల్లెలు..!

పంచాయతీ పారిశుధ్య కార్మికులు సమ్మెలో ఉండటంతో పల్లెల్లో పరిశుభ్రత అస్తవ్యస్తంగా మారుతోంది. మురికికాల్వలు శుభ్రం లేకపోవడం.. రోడ్లపై చెత్తాచెదారం పోగుకావడం.. ఇంటింటి చెత్త సేకరణ నిలిచిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు మాత్రం తాత్కాలిక సిబ్బందిని నియమించి పల్లెల్లో పారిశుధ్యం నిర్వహణ కొనసాగిస్తున్నామని చెబుతుండగా.. చాలా పల్లెల్లో మాత్రం తాత్కాలిక సిబ్బంది అడ్డుకుంటున్నామని పనులు జరగనీయడం లేదని కార్మికులు చెబుతున్నారు. చాలా పల్లెల్లో పారిశుధ్య లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. అప్పటి వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేస్తున్నారు.

స్పందించే వరకు కొనసాగిస్తాం

దేవేందర్, కార్మికుడు, బజార్‌హత్నూర్



ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామాల్లో అన్ని రకాల పనులు చేస్తున్నాం. ఇతర పనులు చేయలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వం అందించే వేతనం చాలా తక్కువగా వస్తుంది. కుటుంబ పోషణ భారంగా మారుతోంది. ప్రభుత్వం వేతనం పెంచడంతో ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి. ప్రభుత్వం స్పందించే వరకు సమ్మె కొనసాగిస్తాం.

తాత్కాలిక సిబ్బందిని నియమించాం

శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి, ఆదిలాబాద్

జిల్లాలో పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తుండటంతో పారిశుధ్యం లోపం లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో తాత్కాలిక సిబ్బందిని నియమించి పరిశుభ్రత చర్యలు చేపడుతున్నాం. అన్ని పంచాయతీల్లో రోజువారీగా పారిశుధ్య కార్యక్రమాలు జరుగుతున్నాయి.

పోరాటాలపై అణచివేత వైఖరి సరికాదు

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కార్మికుల ఆందోళనలు, పోరాటాలపై ప్రభుత్వం అణచివేత వైఖరి అవలంబిస్తోందని, ఇది సరికాదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ విమర్శించారు. ఆదివారం స్థానిక విద్యాధరి ఉన్నత పాఠశాలలో స్కీం వర్కర్ల జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ రంగాల కార్మికులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు. పంచాయతీ, ఐకేపీ వీవోఏ, మున్సిపల్, ఆర్టీసీ, సింగరేణి, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులు, ప్రభుత్వ, కాంట్రాక్టు ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పోరాటాలు చేస్తుంటే వారి పోరాటాలను అణచివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని అన్నారు. ఈ నేపథ్యంలో ఆగష్టు ఆరో తేదీన నిర్వహించే సీఐటీయూ జిల్లా ప్రథమ మహాసభలలో అన్ని రంగాల కార్మికుల సమస్యలపై చర్చించడంతో పాటు రాబోయే రోజులలో చేపట్టబోయే పోరాటాలకు రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలను స్కీం వర్కర్లు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కృష్ణమాచారి, పద్మ, స్వరూప, బద్రుబాయి, అర్చన, మానుకుబాయి, సరోజ, అరుణ, లక్ష్మి, అనసూర్య పాల్గొన్నారు.

ఐక్యతతో సాగుతూ చదువుపై దృష్టి పెట్టాలి

నవతెలంగాణ-కాసిపేట

ఆదివాసీలు ఐక్యతతో ముందుకు సాగుతూ చదువుపై దృష్టి సారించాలని ప్రజా సంఘాల నేతలు, వక్తలు శ్రీమన్నారాయణ, మడావి శంకర్, రోడ్డ గోపాల్, సమ్మయ్య, పల్లె మల్లయ్యలు సూచించారు. ఆదివారం మండలంలోని మల్కేపల్లిలో తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆదివాసీల స్థితిగతులు, ఉనికి, హక్కులు, ఐక్యతపై అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు రాబోయే రోజుల్లో అందరు ఐకమత్యంగా ఉండి చదువుపై దృష్టి సారించినప్పుడే హక్కులు, ఉనికిని కాపాడుకో గలుగుతారని, సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని అవగహన చేస్తూ ముందుకు వెళ్లాలన్నారు. రాజ్యాంగానికి లోబడి పరిపాలన చేసే హక్కు ఆదివాసీలకు ఉందని, ఆదివాసీలు నేడు హక్కులు కోల్పోవడానికి ప్రధాన కారణం ఐక్యత లోపించడమేనన్నారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి ఆడ జంగు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం హన్మంతు, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు విద్మ కిషన్, నాయక్ పోడ్ సేవా సంఘం మండలాధ్యక్షుడు బద్ది శ్రీనివాస్, ఆదివాసీలు తదితరులున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రోగులకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ జిల్లా కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వైద్యం చేస్తున్నారని అన్నారు. వైద్య అధికరులు అందుబాటులో లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో విచ్చలవిడిగా ఏజెన్సీలను పెట్టి, వారికి అర్హత ఉన్నా, లేకున్నా, కాంట్రాక్టులు అప్పగించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తున్న అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలపై, వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇండ్ల పట్టాల పంపిణీ

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి పట్టణంలోని 5,7,8వ వార్డుల్లో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆదివారం 287 మంది లబ్ధిదారులకు శాశ్వత ఇండ్ల పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సుదర్శన్, కోఆప్షన్ సభ్యులు సాజిద్, వాజిద్ కౌన్సిలర్స్ తారవాసు, లావణ్య, విజయ తిరుమల, గేల్లి రాయలింగు, వర్కింగ్ ప్రెసిడెంట్ త్యనారాయణ పాల్గొన్నారు.

ఫిల్టర్ చేసిన నీటిని సరఫరా చేయాలి

నవతెలంగాణ-నస్పూర్

గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు శ్రీరాంపూర్‌లోని ఉదయ్‌నగర్, గాంధీనగర్ వాసులకు వారం పది రోజులుగా ఫిల్టర్ కానీ, కలుషితమైన నీరు సరఫరా అవుతోందని, అధికారులు స్పందించి ఫిల్టర్ చేసిన చేసిన నీటిని సరఫరా చేయాలని 16వ వార్డు కౌన్సిలర్ లావణ్య దేవేందర్ అన్నారు. వర్షాలు తగ్గి మూడు, నాలుగు రోజులు గడుస్తున్న సింగరేణి అధికారులు ఫిల్టర్ బెడ్‌ని శుభ్రపరచడం లేదని, కలుషితమైన నీటిని తాగడం వలన పలువురు అస్వస్తత గురవుతున్నారని తెలిపారు. ఫిల్టర్ బెడ్‌ను శుభ్రపరచి ఏమైనా సమస్యలు ఉంటే సత్వరమే పరిష్కరించి శ్రీరాంపూర్ ఉదయ్ నగర్, గాంధీనగర్ వాసులకు పరిశుభ్రమైన ఫిల్టర్ చేసిన సింగరేణి నీటిని సరఫరా చేయవలసిందిగా సింగరేణి నస్పూర్ ఏఈ సత్యనారాయణను కోరారు.

సెప్టిక్ ట్యాంక్‌లో జారిపడి యువకుడు మృతి

నవతెలంగాణ-నస్పూర్

ప్రమాదవశాత్తు సెప్టిక్ ట్యాంక్‌లో జారిపడి యువకుడు మృతి చెందిన ఘటన సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. నస్పూర్‌కు చెందిన పల్లకొండ సురేష్(28) ఆదివారం ఫ్లడ్ కాలనీలోని మార్టిన్ గ్రామర్ స్కూల్లో సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. గాయాల పాలైన అతన్ని వెంటనే తీసి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతునికి భార్య శిరీష, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై పేర్కొన్నారు.

సీఐని సన్మానించిన షెడ్యూల్ కులాల జేఏసీ నాయకులు

నవతెలంగాణ-జైనూర్

మండలకేంద్రంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ మల్లేష్‌ను ఏజెన్సీ షెడ్యూల్ కులాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు సుద్దాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లో ప్రత్యేక సేవలందించి ప్రాంత ప్రజలకు పోలీసులు మీకోసం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టినందుకు జేఏసీ తరపు నుండి అభినందించారు. కార్యక్రమంలో మాంగ్ సంఘం జిల్లా అధ్యక్షుడు మొహాలె దత్త, అంబేద్కర్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండుగుల మహేష్, మాధిగ సంఘం మండల అధ్యక్షుడు అశోక్, మహర్ సంఘం మండల అధ్యక్షుడు చంద్రకాంత్, మహాత్మా జ్యోతిబాపులే మహాజన సంఘం జిల్లా కార్యదర్శి సుద్దాల ఆనంద్, నాయకులు దిగంబర్, ప్రవీన్ పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

నవతెలంగాణ-జైనూర్

అగస్టు తొమ్మిదవ తేదిన నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మెస్రం మోతీరాం, పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో ఆదివాసీ నాయకులు ఐక్య సమితి పిలుపు మేరకు అన్ని సంఘాల నాయకులు కలిసి విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీ అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వాలు గుర్తించకపోవడం బాధాకరమన్నారు. ప్రపంచంలో ఆదివాసీ ప్రజల జీవనం ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేధన వ్యక్తం చేశారు. ఆదివాసులకు రావాల్సిన హక్కులను, చట్టాలను, రిజర్వేషన్‌లు దక్కకుండా కులాలతో, మతాలతో రాజ్యం చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. నిజమైన ఆదివాసులకు వారి హక్కులు దక్కకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం అధికారికంగా ప్రకటించేందుకు నేడు మండలకేంద్రంలోని మార్కెట్ ఆవరణలో అన్ని



తెగల ఆదివాసులతో జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాలకు ఆదివాసీ తెగలతో అత్యవసర సమావేశం ఏర్పాటుచేయడం జరుగుతుందని తెలిపారు. ఉదయం 11:30 గంటల నుండి ఈ సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. సమావేశానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో సార్‌మేడీ జుగునాక దేవ్‌రావు, సర్పంచ్‌లు మెస్రం నాగోరావు, ఆత్రం జాలింషావ్, నాయకులు కనక వెంకటేశ్వర్‌రావు, అడా వెంకటేష్, దేవేందర్, జంగు పాల్గొన్నారు.

వేతనాలు రాక ఇబ్బందుల్లో హాస్టల్ వర్కర్లు

- ఏజెన్సీలతో సంబంధం లేకుండా ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్



నవతెలంగాణ-హాజీపూర్

వేతనాలు రాక హాస్టల్ వర్కర్స్ ఇబ్బందుల్లో ఉన్నారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. బీసీ అవుట్ సోర్సింగ్ హాస్టల్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ బీసీ కాలేజీ హాస్టల్‌లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ వర్కర్లకు గత 10 నెలలుగా కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించడం లేదని పేర్కొన్నారు. అధికారులను అడిగితే బడ్జెట్ లేదని అంటున్నారన్నారు. వేతనాలు రాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు ఇంటి కిరాయి, పిల్లల చదువులు, కుటుంబ పోషణకు ఇబ్బందులు అవుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఏజెన్సీల ద్వారా కాకుండా నేరుగా ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో సమ్మె బాటపడతామని, బీసీ వర్కర్స్ సీఐటీయులో చేరారు. నూతన జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా కే.మెహర్ బాబ, పి.శ్రీవిద్య, కోశాధికారిగా నర్సింహులు, ఉపాధ్యక్షులుగా పద్మ, సత్యం, సభ్యులు వసంత, కళ, రాజయ్య, స్వప్నలు ఎన్నికయ్యారు.

మాయని గాయం

నవతెలంగాణ-దహేగాం



పై ఫొటోను చూడగానే ఇదెక్కడి బురద రోడ్డు అని అనుకుంటే పప్పులో కాలేసినట్టే.. కాగజ్‌నగర్ నుండి దహేగాం మండలానికి వెళ్ళే ప్రధాన రోడ్డు. పెసరి కుంట స్టేజి వద్ద గత సంవత్సరం వర్షాకాలంలో వరదల కారణంగా రోడ్డు కోతకు గురైంది. కానీ నేటికీ సంవత్సరం గడుస్తున్న రోడ్డుపై నుండి నిత్యం అధికారులు ప్రజా ప్రతినిధులు ప్రయాణం చేస్తున్న కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో రోడ్డు బురద గుంతలా మారి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడుతున్న సమయంలో ద్విచక్ర వాహన దారులు బురదలో జారి పడిపోయిన సందర్భాలు లేకపోలేదు. ఇంత జరుగుతున్నా గత సంవత్సరం నుండి నేటి వరకు రోడ్డుపై మరమ్మతులు చేపట్టక పోవడంతో మాయని వరద గాయాన్ని ప్రతి రోజు గుర్తుచేస్తుంది.

'రోడ్డుకు మరమ్మత్తులు చేయాలి'

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని బోర్డా గ్రామానికి వెళ్లే రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోవడంతో గ్రామస్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిసినప్పుడల్లా నానా అవస్థలు పడుతున్నారు. ప్రజలు వివిధ పనుల నిమిత్తం రాత్రి, పగలు ఈ రోడ్డు గుండా రావాలంటే ప్రాణాలు అరచేతిలో పట్టుకొని ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బయం గుప్పిట్లో ప్రయాణం చేయాల్సి వస్తుంది. గతంలో అనేకసార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసిన ఎవరు స్పందించడంలేదని గ్రామస్తులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డుకు మరమ్మత్తులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-హాజీపూర్

సెలవు రోజుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలుపై చర్యలు తీసుకోవాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాల వల్ల విద్యా సంస్థలు బంద్ ఉన్నప్పటికీ ఆ నిబంధనలను తుంగలో తొక్కి జిల్లా అధికారుల ఆదేశాలను లెక్కచేయకుండా జిల్లా కేంద్రంలో శ్రీ చైతన్య పాఠశాల తరగతులు నడుపుతున్నారని విద్యార్థులు సమాచారం ఇవ్వడంతో పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, విద్యార్థి సంఘంగా వెళ్లి విద్యార్థులను బైకట్ చేసి ఆ పాఠశాలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ అధికారులు నిర్లక్ష్యం వల్లనే మంచిర్యాలలో ఇలాంటివి కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా దీనిపై జిల్లా కలెక్టర్, డీఈఓ, ఎంఈఓ స్పందించి నిబంధనలు పాటించని పాఠశాలలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల జిల్లావ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ సిద్ధార్థ, ఎస్ఎఫ్ఐ అభినవ్ పాల్గొన్నారు.

రోడ్డు మంజూరు చేయడంలో ప్రభుత్వం విఫలం

నవతెలంగాణ-జైనూర్

జిల్లా కేంద్రం నుండి జైనూర్ మండలకేంద్రానికి రావాలంటే ప్రధాన రోడ్డు అధ్వానంగా మారిందని వైఎస్ఆర్ టీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మడావి ఆనంద్ ఈశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మండలకేంద్రంలోని మార్కెట్ కార్యాలయంతో పాటు మండలకేంద్రంలో ప్రధాన రహదారిపై ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి ప్రభుత్వం ప్రజలకు సరైన రోడ్డు సౌకర్యం కల్పించడంలేదని ఆవేధన వ్యక్తం చేశారు. గతకొన్ని రోజులుగా భారీ వర్షాలు కురవడంతో ఏజెన్సీ ప్రాంతంలో రోడ్డు చాలాచోట్ల గుంతలు పడి అధ్వానంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన రహదారిలో కాలినడకన కూడా వెళ్లడానికి వీలులేకుండా అధ్వానంగా మారిందన్నారు. ముఖ్యంగా మండలకేంద్రం నుంచి ఉట్నూర్, ఆసిఫాబాద్‌కు వెళ్లాల్సి వస్తే గుంతలు పడడంతో ప్రసూతి సమయంలో మహిళలు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను మరమ్మత్తులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల వైఎస్ఆర్ టీపీ అధ్యక్షుడు వైయిద్‌ఖాన్, రవి పాల్గొన్నారు.

గ్యాస్ స్టవ్ అందజేత

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ త్రిశూల్‌పహాడ్‌పై ఉన్న శ్రీ అభయాంజనేయ, సిద్ధి వినాయక ఆలయాలకు ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్-అనిత దంపతులు ప్రసాద సామాగ్రితో పాటు గ్యాస్ స్టవ్‌ను అందించారు. ఆలయంలో పూజారిగా ఉన్న రజ్జర్ పాండేకు వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కోశాధికారి అరుణ్‌లోయ, నాయకులు జగదీశ్వర్ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని తాటిగూడ గ్రామ పంచాయతీలో లబ్ధిదారులకు బెల్లంపల్లి ఎమ్మెల్యే దుగ్గం చిన్నయ్య చేతుల మీదిగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తాటిగూడ గ్రామ పంచాయతీలోని తుంగగూడ ముత్యాల భీమయ్యకు రూ.65000, ముత్యాల శ్రీలేఖకు రూ.2 లక్షల చెక్కు అందచేశారు. ఈ కార్యక్రమంలో తాటిగూడ సర్పంచ్ ముత్యాల స్వప్న, ముత్యాల రాజయ్య, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, మాజీ జడ్పీటీసీ రౌత్ సత్తయ్య పాల్గొన్నారు.

మన్‌కీ బాత్‌ను వీక్షించిన బీజేపీ నాయకులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రధాని నరేంద్రమోడీ 103వ మన్ కీ బాత్ ఎపిసోడ్‌ను ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నాయకులు వీక్షించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. నాయకులు శ్రీనివాస్, అరుణ్‌లోయ, చేరాల శ్రీనివాస్, రాణి, గురువేందర్, రవి, బోరెం శంకర్, కొంగ సుదర్శన్ పాల్గొన్నారు.

సమ్మెకు కాంగ్రెస్ నాయకుల సంఘీబావం

నవతెలంగాణ-కడెం



తమ డిమాండ్ల పరిష్కారానికి కడెం మండల ఎంపీడీఓ కార్యాలయానికి ఎదురుగా 26 రోజులుగా సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బందికి ఆదివారం ఏఐసీసీ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్ నాయక్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వినోద్ నాయక్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల డిమాండ్లు అయిన మల్టీ పర్పస్ విధానం రద్దు చేయాలని అన్నారు. వేతనాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. ఒకవేళ డిమాండ్లు నెరవేర్చని యెడల కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మల్లేష్ యాదవ్, సలీం, భూషణ్, రహీం, బబ్లు, రమేష్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-బోథ్



మాల సంక్షేమ సంఘం సొనాల మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా మొరుగు రమేష్, బక్కువరి ఆశన్న, ఉపాధ్యక్షులుగా దాసరి నాగరాజు, జక్కుల లస్మన్న, కోశాధికారిగా దేవుల చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ మాల సంక్షేమ సంఘం బలోపేతానికి అహర్నిశలు కష్టపడి సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన లయన్స్ క్లబ్ సభ్యులు



నవతెలంగాణ- ఆదిలాబాద్‌టౌన్

లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ జన్మదినం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఆదిలాబాద్ కింగ్స్, కాటన్‌సిటీ ఆధ్వర్యంలో లయన్స్ సేవా కేంద్రంలో ఆదివారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి టి.ప్రణీత ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. విజయ డెయిరీ ప్రాంగణంలో సుమారు వంద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలను డీఈఓ కొనియాడారు. లయన్ రమాకాంత్, విజయ డెయిరీ ఉప సంచాలకుడు మధుసూదన్‌రావు, క్లబ్ అధ్యక్షులు కరీం అలీనురాని, చిల్క దేవిదాస్, కార్యదర్శులు భగవాన్‌దాస్, బుక గంగయ్య, ప్రోగ్రాం అధికారి ప్రేమ్‌రాజ్‌గౌడ్, సభ్యులు అశోక్, రవీంద్ర, ప్రకాష్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వమే ఆదుకోవాలి



నవతెలంగాణ-నిర్మల్

ఆర్టీసీని ఉద్యోగులను ప్రభుత్వమే ఆదుకోవాలని టీఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి అన్నారు. ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ రీజినల్ సమావేశం ఆదివారం నిర్మల్ జిల్లాలోని తిరుమల గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. యాజమాన్యం నిరంకుశంగా వ్యవరిస్తూ, కార్మిక చట్టాలను పక్కనపెట్టి అత్యవసర సమయంలో సెలవు కూడా ఇవ్వకుండా, ఉద్యోగులను వేధిస్తున్నారని అన్నారు. పని గంటలు 8 గంటలు కాకుండా 12 గంటలు 14 గంటలు పని చేయించుకుంటున్నారని అవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులు దాచుకున్న సీసీఎస్ డబ్బులు యాజమాన్యం వాడుకుందని, అవి వెంటనే సీసీఎస్‌కు అప్పగించాలని అన్నారు. ఉద్యోగులకు రావాల్సిన 2 పీఆర్సీలను వెంటనే అమలు చేయాలని అన్నారు. సీఎం కేసీఆర్ చొరవ తీసుకొని ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. యూనియన్‌లను పునరిద్ధించాలని కోరారు. అన్ని వర్గాల వారికి ఎన్నో ఆర్థిక పరమైన సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని అన్నారు. అనంతరం తెలంగాణ మజ్దూర్ యూనియన్ ఆదిలాబాద్ రీజియన్ కార్యదర్శిగా నిర్మల్ డిపోకు చెందిన ఉద్యోగి ఆర్.గంగాధర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీఎంయూ రాష్ట్ర అధ్యక్షులు ఏ.ఆర్‌రెడ్డి, కార్యనిర్వాక అధ్యక్షులు కమలాకర్‌గౌడ్, కోశాధికారి రాఘువరెడ్డి, సలహాదారులు యాదయ్య, రాష్ట్ర కార్యదర్శులు ఎల్.రమేష్, ఆదిలాబాద్ రీజియన్‌లోని నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, అసిఫాబాద్, బైంసా, ఉట్నూర్ డిపోల కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉదారత చాటిన గ్రామస్తులు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

నిరుపేద కుంటుబానికి అండగా నిలిచి గ్రామస్తులు ఉదారతను చాటుకున్నారు. ఆదివారం గ్రామస్తులు ఎవరికి వారు తోచినంత అందజేశారు. మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామానికి చెందిన గుండం భోజన్న లక్ష్మి దంపతుల కుమారుడు రఘు(19) గొంతులో గడ్డలై నొప్పితో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రెక్క ఆడితేగాని డొక్క ఆడని నిరుపేద కుటుంబం కావడంతో, చికిత్సకు రూ.5 లక్షలు అవసరమని తెలిసి ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్న కుటుంబానికి గ్రామస్తులు అండగా నిలిచారు. ఆదివారం నుంచి ఎవరికి వారు తమకు తోచినంత ఆర్థిక సాయం చేస్తూ, తమ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. గ్రామస్తుల సమాచారంతో మిగతా గ్రామాల వారు కూడా ఆర్థిక సాయం అందజేస్తున్నారు. పొట్టపెల్లి(కే) గ్రామ సర్పంచ్ ఉల్వాజీ హైమావతి రాజు స్పందించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. బాధితుని ఆరోగ్య విషయన్ని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి వివరించి సహకారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. గ్రామస్తుని కష్టంలో పాలు పంచుకుంటూ ఐక్యతకు మారు పేరుగా నిలుస్తున్న పొట్టపెల్లి(కే) గ్రామాన్ని పలువురు అభినందించారు. దాతల సహకారం అందజేయాల్సిన ఫోన్‌పే, గూగుల్‌పే నెంబర్ : 8125306585(గుండం నిశాంత్)

నేడు నిర్మల్‌లో పర్యటించనున్న ఈటెల రాజేందర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మెన్ ఈటెల రాజేందర్ 31న నిర్మల్ జిల్లా పర్యటనకు వస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ తెలిపారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈటెల రాజేందర్ మూడు రోజుల పర్యటన నిమిత్తం నిర్మల్ జిల్లాకు విచ్చేస్తున్నారని అన్నారు. రైతులకు జరిగిన పంట నష్టం, పేదలకు జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి వస్తున్నట్టు తెలిపారు. అతివృష్టి వల్ల గత వారం రోజులుగా కురిసిన వర్షాల కారణంగా జిల్లా రైతాంగం తీరని నష్టానికి గురైందని, వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని వందల సంఖ్యలో ఇండ్లు నేలమట్టం అయ్యాయని అన్నారు. వారికి మనోధైర్యాన్ని ఇచ్చేందుకు, భరోసాను కల్పించేందుకు పార్టీ వారి వెన్నంటి ఉంటుందని తెలియజేయడానికి ఈటెల రాజేందర్ వస్తున్నారని అన్నారు. రైతు పక్షాన పోరాటం చేసి వారికి న్యాయం జరిగేలా చేయడమే బీజేపీ ఉద్దేశమని అన్నారు. జిల్లా మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు లాలా మున్నా, జోగు రవి, దినేష్ మటోలియ, వేణు గోపాల్, లోక ప్రవీణ్ రెడ్డి, చిలుకూరు జ్యోతిరెడ్డి, సాకటి దశరథ్, సంతోష్, రాందాస్, విజయ్, దయాకర్ పాల్గొన్నారు.

జనహృదయ నాయకుడు సీఆర్‌ఆర్

- దివంగత మాజీ మంత్రి రామచంద్రారెడ్డికి ఘన నివాళులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్



ప్రజాభిమానాన్ని చూరగొన్న గొప్ప జనహృదయ నాయకుడు సీఆర్‌ఆర్ అని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ మానిక్ రావు ఠాక్రే అన్నారు. ఆదివారం మావల మండలంలోని చిలుకూరి లక్ష్మీ గార్డెన్‌లో సంతాప సభను నిర్వహించారు. ముందుగా సీఆర్‌ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి హజరై ఆయన మాట్లాడారు. సీఆర్‌ఆర్ మహారాష్ట్ర ప్రాంత పర్యటనకు వచ్చినపుడు ఆయనతో పలుమార్లు కలిసి అనేక విషయాలపై చర్చించామని అన్నారు. అనంతరం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి దివంగత నాయకులు చిల్కూరి రామచంద్రారెడ్డి తనకు దగ్గరి మిత్రుడని, ఆయనతో కొన్నేండ్ల పాటు కలిసి పార్టీలో పని చేశానని అన్నారు. అందరి సంక్షేమాన్ని కోరే గొప్ప నాయకుడు సీఆర్‌ఆర్ అని అన్నారు. ఆయన మన మధ్యలో లేకపోవడం బాధకమైనప్పటికీ పుట్టిన ప్రతి ఒక్కరూ గిట్టక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సెక్రటరీ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జీ, కర్ణాటక ఎమ్మెల్యే విశ్వనాథ్, డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొరంచు శ్రీకాంత్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు గండ్రత్ సుజాత, వెడ్మ బొజ్జు, మాజీ డీసీసీ అధ్యక్షుడు భార్గవ్ దేశ్‌పాండే, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, జెడ్పీటీసీలు గోక గణేష్‌రెడ్డి, మల్లెపూల నర్సయ్య, చారులత రాథోడ్, పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, నాయకులు నరేష్ జాదవ్, ఆడే గజేందర్, భరత్ వాఘ్మరే, బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి, కంది శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బోథ్ రెవెన్యూ డివిజన్ సాధించే వరకు ఉద్యమం



నవతెలంగాణ-బోథ్

- మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్

బోథ్ రెవెన్యూ డివిజన్ సాధించే వరకు ఉద్యమం ఆపేది లేదని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ అన్నారు. ఆదివారం రిలే నిరాహార దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కొరకు మండల కేంద్రానికి చెందిన నాయి బ్రాహ్మణుల సంఘం రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు అలాగే రిలే నిరాహార దీక్షలు 14వ రోజుకు చేరాయి. బోథ్ నియోజకవర్గ కేంద్రమై ఉండి ఇక్కడ ఉన్న ప్రజలు వారి అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి వారు చేస్తున్న పోరాటానికి మా మద్దతు ఎల్లవేళలా ఉంటుందని అన్నారు. అలాగే సీఎల్పీ నేత భట్టి విక్రమార్క టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డితో దృష్టికి తీసుకువెళతానని అన్నారు. తప్పకుండా రెవెన్యూ డివిజన్ బోథ్‌లోనే ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తామని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కావాలని మోసపూరితంగా ప్రజలను నమ్మించి గొంతు కోస్తున్నారని అన్నారు. అదేవిధంగా జీపీ కార్మికులతో మాట్లాడి వారు చేస్తున్న పోరాటానికి మా మద్దతు ఉంటుందని వారి సమస్యలను మా పార్టీ సీనియర్ నాయకులతో మాట్లాడి వారికి వివరిస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో నియోజక వర్గ నాయకుడు ఆడే మండల కన్వీనర్ కురుమే మహేందర్, గజేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, పట్టణ అధ్యక్షుడు సల్ల రవి, మైనార్టీ సామాజిక సేవకుడు జక్కుల వెంకటేష్, నాయకులు షేక్ నాజర్ అహ్మద్, అబ్రార్, మైనార్టీ రైముద్దిన్, అరుణ్‌రెడ్డి, అబ్దుల్ అసిఫ్, హబుబ్, సలీం, జీకే గంగాధర్ పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకే కార్డెన్ సెర్చ్

నవతెలంగాణ-కుభీర్



శాంతి భద్రతల పరిరక్షణకే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని, భైంసా రూరల్ సీఐ నైలు అన్నారు. ఆదివారం మండలంలోని పార్డి(బి) గ్రామ పంచాయతీలో సీఐ నైలు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం పోలీసులు ఉన్నారని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా చూడాలని అన్నారు. గ్రామంలో గంజాయి, దేశీదారు వంటివి విక్రయాలు జరిగినట్లుగా తెలిస్తే సమాచారం అందించాలని తెలిపారు. సమాచారం అందించిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. అదే విధంగా గ్రామంలో ప్రతి చోట సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకుంటే 1 సీసీ కెమెరా 100 మందితో సమానమని గుర్తు చేశారు. దీంతో వాటి విలువ ఏదైనా సమస్య జరిగినట్లతే అప్పుడు వాటి విలువలు తెలుస్తాయని అన్నారు. దీంతో పాటు వాహనదారులు ఏదైనా వాహనాన్ని కొనుగోలు చేసినప్పుడు వాటికి అవసరమైన పత్రాలు సరిగ్గా ఉన్నాయా లేదా అని సరిచూసుకోవాలని అన్నారు. తనిఖీలో సరైన ధృవపత్రాలు లేని వాహనాలు 90మోటార్ సైకిల్స్ 1ఆటో 1ఫోర్ విల్లర్‌లను సీజ్ చేశామని అన్నారు. అదే విధంగా వాహనానికి సంబంధించిన పత్రాలు లైసెన్స్ కలిగి ఉండాలని అన్నారు. అంతకు ముందు గ్రామానికి నూతనంగా వచ్చిన సీఐ నైలుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచ్ సీఐ నైలు ఎస్సై షరీఫ్‌లకు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్డెన్ సెర్చ్‌లో ఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్స్-6, స్పెషల్ పార్టీ సిబ్బంది 40 మందితో తనిఖీలు చేశారు. ఈ తనిఖీలో భాగంగా ఉదయం 4గంటలకు ముందుగా గ్రామంలో పోలీసులు బృందాలుగా విడిపోయి గ్రామంలో ఉన్న ఇంటి ఇంటికి తనిఖీలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తూము పుష్పాలత రాజేశ్వర్, ఎస్సై షరీఫ్, ఉపసర్పంచ్ తుకారాం వార్డు సభ్యులు శేఖర్, నారాయణ, గణేష్, సురేష్, వాహనదారులు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

అప్పుల రాష్ట్రంగా తెలంగాణ



నవతెలంగాణ-నిర్మల్

- బీజేపీ నాయకులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చరని బీజేపీ నాయకులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో సోన్ మండలం సిద్దులకుంట గ్రామానికి చెందిన పలువురు యువకులు బీజేపీలో చేరారు. బీఆర్‌ఎస్ నాయకులు సంతోష్‌రెడ్డి, ముత్యంరెడ్డితో పాటు పలువురు యువకులు చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత బంగారు తెలంగాణ అని గొప్పలు చెప్పిన కేసీఆర్ అప్పుల తెలంగాణగా మార్చారని అన్నారు. ప్రతి ఒక్క వ్యక్తిపై సుమారు లక్ష రూపాయల అప్పు పెట్టిన ఘనత ఈ అవినీతి ప్రభుత్వానిదేనని ఏద్దేవా చేశారు. రైతులను సైతం ఈ ప్రభుత్వం నిండా ముంచిందని, పంటనష్ట పరిహారం ఇవ్వకుండా రైతుల ఉసురు తీస్తుందని అన్నారు. ఈ అవినీతి ప్రభుత్వానికి చరమగీతం పాడాలని అన్నారు. అలాగే మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేసిన అక్రమాలను, భూకబ్జాలు, చెరువుల కబ్జాలు, డీ- పట్టాల పేరిట వేల ఎకరాల భూములు కబ్జా చేశారని అన్నారు. ఈ అవినీతి పాలనను అరికట్టేందుకు నిర్మల్ గడ్డపై కాషాయ జెండా ఎగురవేసే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పెద్దపల్లి జిల్లా ఇన్‌ఛార్జి రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సరికెల గంగన్న, నాయకులు హరీష్‌రెడ్డి, మార గంగారెడ్డి, సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ భూమేష్, నాయకులు మగ్గిడి నర్సారెడ్డి, సురేష్, చందర్, గణపతి, మధుసూధన్, గంగారెడ్డి, కనకాపురం ముత్యంరెడ్డి, గాధేపల్లి సంతోష్‌రెడ్డి, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులు అధైర్య పడొద్దు



నవతెలంగాణ-ముధోల్

రైతులు అధైర్యపడొద్దని ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లి నష్ట పరిహారం అందేలా చూస్తానని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలో నష్టపోయిన పంటలు, కోతకు గురైన రోడ్లను పరిశీలించారు. అలాగే కూలిన గిరిజన పాఠశాల ప్రహరీ గోడను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారీ వర్షాలకు నష్టపోయిన పంటలు, కోతకు గురైన రోడ్లు సంబంధిత అధికారుల నుంచి నష్టం వివరాలను సేకరిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని, ముధోల్ ధర్మబాద్ రోడ్డు పలు చోట్ల కోతకు గురైంది. వెంటనే వాటికి మరమ్మతులు చేయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ పీఏసీఎస్ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు ఖాలీద్, నాయకులు పోతన్న యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, సమీఉల్లాఖాన్, బాబన్న, విశ్వంబర్ ఉన్నారు.

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు



నవతెలంగాణ-నిర్మల్

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ భవన్‌లో సభ్యత్వ నమోదు ప్రక్రియ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గాజర్ల నారాయణ వర్మ మాట్లాడారు. జనవిజ్ఞాన వేదిక, విజ్ఞాన శాస్త్ర సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకుపోయి ప్రజల్లో చైతన్యం కలుగజేసి సామాజిక అభివృద్ధికి తోడ్పటంతో పాటు మూఢనమ్మకాలు, సాంఘీక దురాచారాలను తొలగించటానికి విశేష కృషి చేస్తుందన్నారు. మరిన్ని సామాజిక కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించడానికి ప్రజలు, విద్యావంతులు, మేధావులు జనవిజ్ఞాన వేదిక సభ్యత్వం తీసుకుని సంస్థను బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అంకం గంగాధర్, చెకుముకి కన్వీనర్ అనంత విశ్వేశ్వర్, కార్యదర్శి గజపల్లి నర్సయ్యు పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం



నవతెలంగాణ- బేల

రైతులెవరూ అధైర్యపడొద్దని, నష్ట పోయిన రైతులను ప్రభుత్వం తరుపున పూర్తిగా ఆదుకుంటామని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం మండలంలోని సైద్‌పూర్, దౌన, రేణిగూడ, సాంగ్వి గ్రామాల్లో పర్యటించారు. వాగులతో నష్టపోయిన పంట పొలాలతో పాటు రేణిగూడలో కొట్టుకు పోయిన బ్రిడ్జిని, వరద నీరు చేరిన ఇండ్లను, సాంగ్విలో చెరు కట్టను పరిశీలించారు. దౌనా, రేణిగూడ, గ్రామాలలో ఇండ్లల్లో నీరు చేరి నిత్యావసర వస్తువులు పూర్తిగా తడిసి పోయిన 6 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.3వేలు అందజేశారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తామని, ఇతర చోట గృహలక్ష్మి పథకం కింద ఇండ్లు కట్టిస్తామని బరోసానిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొన్న కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు, పొంగిపొర్లి భారీ నష్టాన్ని మిగిల్చాయనీ అన్నారు. అటు పెన్ గంగా పరివాహక ప్రాంతంలో వరదలతో నష్టం జరుగగా, ఇటు వాగులు, వంకలతో వ్యసాయ పంట పొలాలు చాలా నష్టం వాటిల్లిందని అన్నారు. దీంతో పాటు చాలా చోట్ల బ్రిడ్జిలు కొట్టుకు పోయాయని అన్నారు. రేణిగూడ గ్రామానికి వెళ్లే బ్రిడ్జి రూ.3.10కోట్ల నిధు మంజూరు చేశామని అన్నారు. ఎమ్మెల్యే వెంట డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, మెట్టు ప్రహ్లాద్, నాయకులు గంభీర్ ఠాక్రే, దేవన్న, సతీష్ పవార్, రోహిదాస్, దత్తు, రాథోడ్ శ్యామ్‌రావ్ పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేయాలి



నవతెలంగాణ-తలమడుగు

మండలంలో కురిసిన భారీ వర్షాలకు భరంపూర్ గ్రామ చిన్న వాగు వంతెన కొట్టుకుపోవడంతో ఆదివారం భరంపూర్ మండల సాధన సమితి నాయకులు ఎమ్మెల్యే రాథోడ్ బాపురావును కలిశారు. ఈ సందర్భంగా సాధన సమితి నాయకులు ఎమ్మెల్యేతో మాట్లాడారు. సుమారు 24 గ్రామాలకు రోడ్డు వసతి లేనందున తాత్కాలికంగా మమ్మతులు చేయించాలని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావును కోరారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి ఆర్ అండ్ బి అధికారులకు ఫోన్ చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బొల్లారపు బాబన్న, కే.రమేష్‌రెడ్డి, మొట్టె కిరణ్, సాగర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, శాస్త్రి, లక్ష్మారెడ్డి, అర్లి గ్రామస్తులు ఉన్నారు.

పీపీని సన్మానించిన సొనాల గ్రామస్తులు



నవతెలంగాణ-బోథ్

పబ్లిక్ ప్రాసిక్యూటర్ మేకల మధుకర్‌ను ఆదివారం సొనాల గ్రామస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా పీపీ మాట్లాడుతూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, చట్టాన్ని గౌరవించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ అమృత్‌రావు పాటిల్, సొసైటీ డైరెక్టర్ లోలపు పోశెట్టి, బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు మునేశ్వర్ సోమన్న, నాయకులు సంతోష్ పాముల, భీంరావ్ పాటిల్, బి.రాజారాం, దేవ్‌రావు, సంఘపాల్, దేవిదాస్, గాజ్జరం, గణేష్ పాల్గొన్నారు.

ప్రజల సౌకర్యార్థం నూతన విద్యుత్ పోల్స్ ఏర్పాటు



నవతెలంగాణ-నిర్మల్

ప్రజల సౌకర్యార్థం నూతన విద్యుత్ పోల్స్‌ను ఏర్పాటు చేశామని మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని వార్డు నెం.14 మౌలానా ఆజాద్ నగర్ రోడ్ నెం.2 ప్రాంతంలో విద్యుత్ పోల్స్, విద్యుత్ తీగలు క్రిందికి వేలాడుతూ ప్రమాదకర స్థితిలో ఉన్నాయని, స్థానిక కౌన్సిలర్ అబ్దుల్ మతిన్ మున్సిపల్ చైర్మెన్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించి, ఆ ప్రాంతంలో పర్యటించారు. సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి పాత పోల్స్‌ని తొలగింపచేసి, నూతనంగా 5 విద్యుత్ పోల్స్‌ను ఏర్పాటు చేశారు. పట్టణ వార్డుల్లో నెలకొన్న సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తామని అన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. చైర్మెన్ వెంట మక్బూల్, శాబ్దుఖాన్, ఫాసిక్ టేలర్, రాషాద్, ఎస్‌కే బాబర్, అమాన్, జాకీర్ ఉన్నారు.

ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన నిర్మల్ ఆర్డీఓ

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్‌ను ఆదివారం నిర్మల్ ఆర్డీఓ రత్నాకళ్యాణి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల బదిలీపై వచ్చిన ఆమె ఎమ్మెల్యేను కలిసి ఆమె నివాసంలో పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ తహసీల్దార్ రాజమోహన్ నాయకులు డాక్టర్ కేహెచ్ ఖాన్ మండల నాయకులు ఉన్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన తహసీల్దార్

నవతెలంగాణ-జన్నారం



వచ్చే శాసనసభ ఎన్నికల దృశ్య మండలంలోని రాంపూర్, తిమ్మాపూర్, తపాలాపూర్ గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూతులను తహసీల్దార్ ఇట్యాల కిషన్ ఆదివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యుత్తు కుర్చీలు నీటి సౌకర్యం, టాయిలెట్ సౌకర్యం ఉన్నాయా లేదా.. వాటికి సంబంధించిన పనులను పూర్తి చేయాలని, ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులకు సూచించారు. ఆయన వెంట ఆర్ఐ భాను చందర్ ఉన్నారు.

ఎస్సీ కమ్యూనిటిహాల్‌కు భూమిపూజ

నవతెలంగాణ-కౌటాల



మండలంలోని వీర్దండి గ్రామంలో ఎస్సీ కమ్యూనిటిహాల్‌కు ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ సర్పంచ్ మడావి రేణుకతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.7.50 లక్షల నిధులను ఎస్సీ కమ్యూనిటీహాల్ నిర్మించేందుకు నిధులు మంజూరుచేసినట్టు ఆయన తెలిపారు. నిర్మాణంలో నాణ్యతలోపించకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ ఆత్మారాం, నాయకులు మధూకర్, విలాస్, శ్యాంరావు పాల్గొన్నారు.

బస్సుడీపో ఏర్పాటుకు భూమి పూజ



నవతెలంగాణ-కోటపల్లి

చెన్నూరు పట్టణంలో రూ.నాలుగు కోట్లతో నూతనంగా నిర్మించనున్న బస్‌డీపో పనులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బస్సు డీపో వల్ల చుట్టూ ఉన్న పల్లెలకు బస్సు సౌకర్యం అందుబాటులో ఉంటుందని అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల చెన్నూరు పట్టణం అభివృద్ధి చెందలేదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చెన్నూర్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. ప్రజలు ఎన్నికలు దగ్గర పడుతున్న వేలా అప్రమత్తంగా ఉండాలని చిల్లర రాజకీయాలు చేసే బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. అకాల వర్షాలకు పంట నష్టం జరిగిన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని ఎవరు అధర్య పడొద్దని అన్నారు.

పారిశుధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలి



నవతెలంగాణ-కౌటాల

పారిశుధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా పంచాయతీరాజ్ అధికారి సురేందర్ అన్నారు. మండలకేంద్రంలో పలు వీధుల్లో తిరుగుతూ పారిశుధ్య పనులను పరిశీలించి మిషన్ భగీరథ పైపులైన్‌లను మరమ్మత్తులు చేపట్టాలని, ప్రతిరోజు దోమలు మందు పిచికారి చేస్తూ బ్లీచింగ్ వేయాలని, దోమలను నివారించి వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏపీఓ పూర్ణిమ, ఏపీఎం వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ ఉన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



నవతెలంగాణ-కౌటాల

దళిత విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎంపీపీ, భారతీయ బౌద్ధ మహాసభ తాలుకా అధ్యక్షుడు బసార్కర్ విశ్వనాథ్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని బుద్ధవిహార్ ప్రాంగణంలో మండలానికి చెందిన పలువురు విద్యార్థులు విభాగాల్లో జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచి సీటు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి చెందిన దుర్గం తేజ ఏఈఈ అడ్వాన్స్‌లో 2741 ర్యాంకు సాధించి సీటు సాధించాడని, జాడి నితిన్ నీట్‌లో 447 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచాడని, చునార్కర్ ఉర్మిత నీట్‌లో 370 మార్కులు సాధించి ఎంబీబీఎస్ సీటు సాధించడంతో ఆ ముగ్గురిని సన్మానించి ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివి జాతీయస్థాయిలో రాణించడం సంతోషించదగ్గ విషయమన్నారు. దళిత పేద కుటుంబాల నుండి ఉన్నతస్థానాల్లో సీట్లు సాధించడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నేతకానీ మహర్ సంఘం మండల అధ్యక్షుడు దుర్గం జానకిరావ్, జశ్వంత్ బుద్ధవిహార్ కమిటీ గౌరవధ్యక్షుడు దుర్గం జీవన్‌దాస్, పత్రు, కమిటీ సభ్యులు భీంరావు, కిశోర్, మధూకర్, అశోక్, దోమాజీ, గోపాల్, మారుతి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

నవతెలంగాణ-తాండూర్

ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ ఘట్టమనేని బాపురావు జన్మదిన సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సేవాజ్యోతి అనాథాశ్రమంలో పిల్లలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రౌతు వెంకటేశం, కార్యదర్శి ఠాకుర్ ఉమ్రావ్ సింగ్, కోశాధికారి మద్దికుంట రాంచందర్, సంగీతరావు, సిరంగి శంకర్, కొడిప్యాక శ్రీనివాస్, దేవరకొండ రాజయ్య పాల్గొన్నారు.

మందమర్రి : మందమర్రి, కళ్యాణిఖని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు జన్మదినాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 200మంది పేదలకు అన్నదానం చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తిరుమలేష్ మాట్లాడుతూ ప్రజలకు సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ ముందుంటుదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొక్కుల మధు, వైస్ ప్రెసిడెంట్ గౌతమ్, కౌట్ల అనిత, అనుదీప్, కళ్యాణిఖని సెక్రెటరీ నామని ముత్తయ్య పాల్గొన్నారు.

రైతాంగ సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వ విఫలం

నవతెలంగాణ-దండేపల్లి

రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న టీఆర్ఎస్ ప్రభుత్వం రైతాంగ సమస్యల పరిష్కారంలో విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముల్కల్ల మల్లారెడ్డి ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వడ్ల కొనుగోలులో డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాలలో రైతులకు కోత విధించి జిల్లాలో దాదాపు రూ.3 కోట్ల కుంభకోణనకు పాల్పడ్డారని ఇందుకు జాయింట్ కలెక్టర్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు మున్నారాజ సిసోడియా, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు తమ్మినీడు శ్రీనివాస్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తె భీమేష్, నాయకులు అకుల అశోక్ వర్ధన్, కొండ నరేష్, ముస్కె కార్తీక్ , ఢీకొండ లక్ష్మణ్, టేకుమాట్ల గురువయ్య పాల్గొన్నారు.

కొట్టుకుపోయిన ఆశల సాగు

- పూర్తిగా తుడుచుపెట్టుకుపోయిన పత్తి పంట
- కన్నీటి పర్యాంతమవుతున్న రైతులు
- ఆదుకోవాలని వేడుకోలు

నవతెలంగాణ-దహెగాం

వ్యవసాయమే వారికి జీవనాధారం. భూమి ఉన్న వారు కొందరైతే లేనివారు మరెందరో. భూమి ఉన్నా కౌలుకు తీసుకున్న వ్యవసాయమే తప్పా వారికి వేరే మార్గం లేదు. ఆరుగాలం కష్టించి దుక్కిదున్ని తాలు పట్టి విత్తనాలు పెట్టి మందు చల్లిన తర్వాత మొలకెత్తిన మొలకను చూసి రైతన్న తన కన్న బిడ్డను చూసినంతగా మురిసిపోతాడు. కానీ ఆ చిరునవ్వు కాస్త పెద్దవాగు వరద రూపంలో వచ్చి వారి ఆశలన్నీ తుడిచెపెట్టేసింది. ఆశలు చిగురించిన ఆదిలోనే పంటలు కొట్టుకుపోవడంతో కన్నీంటి పర్యాంతమవుతున్నారు. వ్యవసాయాన్ని నమ్ముకొని అప్పుచేసి సాగుచేస్తే తీరా మొలక దశలోనే వరద రూపంలో కొట్టుకుపోతే మళ్లీ అప్పులు చేసేదెలా సాగు సాగెదెలా అంటూ ఆవేధన చెందుతున్నారు. పెద్దవాగు పరివాహక ప్రాంత రైతుల కన్నీటి గాథపై నవతెలంగాణ ప్రత్యేక కథనం...

మూడేండ్లుగా ముంచుతోంది

గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్దవాగు తన ప్రతాపాన్ని కొనసాగిస్తుంది. వర్షాకాలం వచ్చిందంటే వరద ముప్పు ఎప్పుడు వస్తుందోనని ప్రజలు బయపడి పోతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వరుసగా మూడు సంవత్సరాలుగా పెద్దవాగు వరద ఉధృతి విపరీతంగా పెరిగిపోయి పంట, ప్రాణ, పశు సంపద, ఆస్తి నష్టాలు భారీగా జరుగుతున్నాయి. ప్రతి సంవత్సరం ఎంతో ఆశగా పరివాహక ప్రాంత రైతులు ఈసారి వరద రాదేమో అనే ఆశతో మొదలుపెట్టిన సాగును మొదటిలోనే పెద్దవాగు ముంచేస్తుంది. విత్తనాలు పెట్టిన తర్వాత మొలకలు కాస్త ఎదిగే దశలోనే వరదలు రావడం, పంట కొట్టుకుపోవడం పరిపాటిగా మారింది. దీంతో ఆశల సాగు చేసే రైతన్నకు నిరాశే మిగులుతోంది. చేన్లలో కొట్టుకుపోయిన పత్తి మొలకలు, పేరుకుపోయిన బురద, పెట్టిన ఇసుక మేటలే కనిపిస్తుండడంతో రైతుల గుండెలు తరుక్కుపోతున్నాయి. కొట్టుకుపోయిన పత్తి స్థానంలో వేరే పంట సాగుకు పైసలు లేక పత్తి చేన్లను గత మూడు సంవత్సరాలుగా బీల్లుగానే వదిలేయాల్సి వస్తుందని రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.

పరిహారం పరిహాసమే..!


రైతులకు పంట నష్టం వాటిల్లితే పరిహారం చెల్లించి ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు మిన్నకుండిపోవడంతో పరిహారం పరిహాసంగానే మిగిలిపోతోంది. గత మూడేండ్లుగా మండలంలో పెద్దవాగు, ఎర్రవాగు ప్రాణహిత బ్యాక్ వాటర్‌తో ఇట్యాల, రాళ్లగూడ, బోర్లకుంట, కొత్మీర్, బీబ్రా, ఐనం, చిన్నఐనం, దహెగాం, లగ్గాం, మర్రిపల్లి, ఒడ్డుగూడ, గెర్రె, అమర్‌గొండ, గిరవెల్లి, ఖర్జీ, మొట్లగూడ తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల్లో పంట నష్టం వాటిల్లుతోంది. కానీ అన్నీ చూస్తున్న ప్రభుత్వం కానీ, అధికారులు కానీ వీటిని పట్టించుకోవడంలేదు. గత సంవత్సరం వచ్చిన వరదల వల్ల ఇంతకంటే రెట్టింపు నష్టాన్నే మిగిల్చాయి. దీంతో ఒకవైపు రైతులు మరోవైపు ప్రతిపక్షాలు ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేయడంతో స్పందించిన ప్రభుత్వం కేవలం సర్వే చేపట్టి ఊరుకోవడం విశేషం. దీంతో గత మూడేండ్లుగా నష్టపోయిన రైతులకు నయాపైసా పరిహారం రాకపోవడంతో తాము పడే బాధలు ఎవరికి పట్టవా అంటూ రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏటా వేసిన పంటలు వరద పాలవుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో రైతుల్లో అసహనం పెరిగిపోతుంది. ఇప్పటికైనా జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.





ఏటా నష్టపోతున్నాం

-జావరి రమేష్, రైతు, ఒడ్డుగూడ



ప్రతీఏటా వరద రూపంలో పంట కొట్టుకుపోయి నష్టపోతున్నాం. ఈసారి కూడా మూడెకరాలు పంటను సాగు చేశాను. మొలక మంచి ఎదుగు దశలో ఉండగానే ఇటీవల వచ్చిన వరదలతో పూర్తిగా కొట్టుకుపోయింది. ఇప్పటికే సుమారు రూ.40 వేలు వరకు విత్తనాలు, ఎరువులు, మందుల రూపంలో ఖర్చు పెట్టాను. కానీ పత్తి మొక్కలు మొత్తం వరద దాటికి క్రిందపడిపోయాయి. దీంతో ఏం చేయాలో దిక్కుతోచడం లేదు. ప్రభుత్వం ఈ సంవత్సరమైనా పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

మమ్మల్ని ఆదుకునే వారెవరు

-దండెర శ్రీనివాస్, రైతు, ఒడ్డుగూడ



వరుసగా మూడు సంవత్సరాలుగా వరదల రూపంలో పంట నష్టపోతున్నాను. ఈ సంవత్సరం కూడా ఐదెకరాల్లో పత్తిని సాగుచేశాను. ఇప్పటికే సుమారు రూ.60 వేల వరకు పంట కోసం ఖర్చు పెట్టాను. మొక్కలు ఎక్కడికక్కడ నేలకొరిగిపోయాయి. మరికొన్ని బురదలో కూరుకుపోయాయి. గత మూడు సంవత్సరాలుగా చేసిన అప్పులు తీరటంలేదంటే మళ్లీ పంట కొట్టుకుపోయింది. గతంలో ప్రభుత్వం మాత్రం నయాపైసా నష్టపరిహారం ఇవ్వలేదు.

గ్రామపంచాయతీల ప్రగతికి ప్రభుత్వం కృషి

నవతెలంగాణ-తాండూర్

గ్రామ పంచాయతీల ప్రగతికి ప్రభుత్వం కృషి చేస్తోందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నాయ్య అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తపెల్లి గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార వికేంద్రీకరణ ద్వారా పల్లెలు ప్రగతి చెందే విధంగా ప్రభుత్వం గ్రామ పంచాయతీల విభజన చేసిందన్నారు. గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి మారుమూల ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. గ్రామపంచాయతీలలో మౌలికమైన వసతుల ఏర్పాటుకు ప్రభుత్వం నిధులను వెచ్చిస్తుందన్నారు. ఇప్పటికే గ్రామపంచాయతీలలో స్మశాన వాటికలు, పకృతి వనాలు, క్రీడా మైదానాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం స్థానిక సంస్థలకు స్వపరిపాలన అందించే విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నాఆరు. మండలంలోని ఆరు గ్రామపంచాయతీ భవనాలకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. గ్రామపంచాయతీ భవన నిర్మాణం త్వరిగతిన చేపట్టాలని సదరు కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దత్తుమూర్తి, ఎంపీపీ పూసల ప్రణయ్ కుమార్, జడ్పీటీసీ బానయ్య, కొత్తపల్లి సర్పంచ్ వేల్పుల రజిత, తాండూర్ ఎంపీటీసీ సిరంగి శంకర్, కోఆప్షన్ సభ్యుడు రహమతుల్లా పాల్గొన్నారు.



గాలింపు ముమ్మరం చేయాలి

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తుంపల్లి వాగులో గల్లంతైన ఇద్దరు వ్యక్తులను కనిపెట్టడానికి గాలింపు చర్యలు మరింత ముమ్మరం చేయాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అధికారులను ఆదేశించారు. తుంపల్లి వాగు ప్రవాహ దారి వెంట గజ ఈతగాళ్ల సహాయంతో చేపడుతున్న గాలింపు చర్యలను గుండి వాగు వద్ద, జగన్నాథ్ పూర్ వద్ద పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాగు ప్రవాహంలో ఇద్దరు గల్లంతు కావడం బాధాకరమన్నారు. తమ శక్తి సామర్థ్యాలు పూర్తిగా ఉపయోగించి గల్లంతయిన వారిని కనుక్కోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. అధికారులు ఎక్కడికక్కడ గాలింపు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. సాధ్యమైనంత త్వరగా ఇద్దరిని కనుక్కుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, తహసీల్దార్ రామ్ మోహన్‌రావు, నాయకులు బండి సాయి, బంధువులు నరసింహ పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-బెజ్జూర్

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరద ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ కలెక్టర్ దాసరి వేణు అన్నారు. ఆదివారం మండలంలోని కృష్ణపెల్లి, సోమిని గ్రామాల మధ్య లోలెవల్ వంతెనలు, సోమిని గ్రామ సమీపంలోని ప్రాణహిత బ్యాక్ వాటర్ కారణంగా నీట మునిగిన పంటలను పరిశీలించారు. ప్రాణహిత బ్యాక్ వాటర్ ఎక్కడి వరకు వచ్చి ఎంతమేర పంటలు నీట మునుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ప్రాణహిత బ్యాక్ వాటర్‌తో పంట చేన్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు, రైతులు దాటకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాగుల వద్ద కూడా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ...

మండలకేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ దాసరి వేణు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రికార్డులు, మందుల స్టాకును పరిశీలించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు సక్రమంగా రావడంలేదని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకురావడంతో జిల్లా వైద్యాధికారితో మాట్లాడారు. ఆస్పత్రిలో వైద్యులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతం కావడంతో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీపాల్, ఎంపీడీఓ మాధవి, ఎంపీఓ రమేష్‌రెడ్డి ఉన్నారు.

రేపు చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కెరమెరి

ఆగస్టు 1న రవీంద్ర భారతి లో నిర్వహించ తలపెట్టిన అన్నాభవు సాఠే 103 జయంతి ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర రాజధానిలోని రవీంద్ర భారతిలో మంగళవారం నిర్వహించే చలో హైదరబాద్‌ను విజయవంతం చేయాలని మాంగ్ సమాజ్ మండల ఉపాధ్యాక్షుడు దాసరే ఆకాష్ అన్నారు. ఆదివారం అడ్డెసర గ్రామంలో మాంగ్ సమాజ్ కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. మహారాష్ట్ర యువ కవిగా, దళిత సాహిత్య చరిత్రలో ఆద్యుడిగా పేరొందిన అన్నాభావు సాఠే, ఆగస్టు 1వ తేదీన 1920లో జన్మించారని తెలిపారు. కమ్యూనిస్టుగా ఉన్న ఆయన ఆ తర్వాత మహాత్మ జ్యోతిబా పూలే, సావిత్రీ బాయిపూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో దళిత ఉద్యమంలో చేరారని పేర్కొన్నారు. బీఆర్ అంబేద్కర్ భావజాలాన్ని మహారాష్ట్ర ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అనేక రచనలు చేసి, మాతంగ్ సామాజిక వర్గానికి చెందిన అన్నాభావు సాఠే, దళిత జనోద్ధరణ కోసం జీవితాంతం పాటు పడ్డారన్నారు. ఆగష్టు 1 హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించే ఆయన జయంతి వేడుకలకు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాంగ్ కార్యకర్తలు పాల్గొన్నారు.



గ్రామాలకు తరలిన వైద్య సిబ్బంది



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గత వారం రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలతో జిల్లాలో వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఇదే సందర్భంలో గత రెండు రోజులు నుండి వర్షం కొంత తగ్గడంతో గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు ముమ్మరంగా వైద్యసేవలు చేపట్టారు. దీనిలో భాగంగా మండలంలోని అడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మోవాడు గ్రామపంచాయతీలోని లింగూడ గ్రామంలో వైద్య సేవలు అందించడానికి సిబ్బంది వాగు దాటి వెళ్లారు. వాగులు సైతం దాటి వైద్యం చేయడంపై పలువురు సిబ్బందిని అభినందించారు. గ్రామంలో నీటి నిల్వ ఉన్నచోట శానిటేషన్ చేయించడంతోపాటు గ్రామస్తులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. గ్రామంలో నీటి నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రత పాటించాలని అన్నారు. గ్రామంలో ప్రజల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మోవాడు సర్పంచ్ కౌసల్య, సెక్రెటరీ శ్వేత, మల్టీ లెవెల్ హెల్త్ ప్రాక్టీషనర్ మౌనిక, విజయసాగర్, ఎంపీహెచ్ఎస్ ఉత్తమ్ రాథోడ్, ఎంపీహెచ్ఏ భీంరావు, సిబ్బంది పరశురాం, ఆశా వర్కర్ సుమిత్ర పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్టీయూ ధ్యేయం



నవతెలంగాణ-జన్నారం

ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్టీయూ ధ్యేయమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని సంఘ భవనంలో మండల అధ్యక్షుడు కట్ట రాజమౌళి ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి ఉద్యోగ ఉపాధ్యాయులను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. ఉద్యోగులకు పీఆర్సీ తోపాటు ఐఆర్ ఇవ్వాలన్నారు. అందుకు ఈ సంఘం ప్రభుత్వంపై పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులంతా పీఆర్టీయూలో సంఘంలో సభ్యత్వం తీసుకోవాలని కోరారు. 317 జీఓ ప్రకారం నష్టపోయిన ఉపాధ్యాయులను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నగురు సత్యనారాయణ, స్టేట్ అసోసియేషన్ ప్రెసిడెంట్, కొంద్రు జనార్ధన్, జాడి మురళి, విజయ్ చందర్, జాజాల శ్రీనివాస్ నెమలికొండ ప్రభాకర్, కాంతయ్య సురేష్ పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వరద పరిస్థితుల కారణంగా నేడు కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ బొర్కాడే హేమంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజావాణికి వచ్చే దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి కలెక్టరేట్‌కు దరఖాస్తు ఇవ్వడానికి రాకూడదని ప్రజలు దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని, తదుపరి ప్రజావాణి యధాతధంగా కొనసాగుతుందని పేర్కొన్నారు.

విద్యుద్ఘాతంతో ఎద్దు మృత్యువాత

నవతెలంగాణ-కుభీర్

విద్యుద్ఘాతంతో ఎద్దు మృత్యువాత పడ్డ సంఘటన మండలంలోని వాయి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సిందే శంకర్‌రావు పటేల్ రైతుకు చెందిన ఎద్దు ఆదివారం గ్రామశివారు ప్రాంతంలో ఉన్న వ్యవసాయ భూమిలోకి మేత కొరకు తీసుకువెల్లగా అక్కడ ఇటీవల భారీ వర్షం కురవడంతో విద్యుత్ తీగలు తెగి కింద పడ్డాయి. రైతు విద్యుత్ తీగలను గమనించకుండా ప్రమాదవశాత్తు ఎద్దు ఒక్కసారిగా విద్యుత్ తీగకు తగలడంతో అక్కడిక్కడే కింద పడిపోవడం చూసిన రైతు అక్కడ విద్యుత్ తీగలు తెగి కిందపడటంతోనే ఎద్దు మృతి చెందిందని రైతు తెలిపారు. దీని విలువ సుమారు 60వేలు ఉంటుందని రైతు తెలిపారు. ప్రభుత్వం ద్వారా రైతుకు ఆర్థిక సాయం అందేలా చూడాలని రైతు ఆవేదన తెలిపారు.

పురుగులమందు తాగి ఆత్మహత్య

నవతెలంగాణ-లోకేశ్వరం

పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలోని రాజుర గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుస్కుల నందు(16) ఎదుగుదల లోపం, ఫిట్స్‌తో బాధపడుతుండేవాడు. గత నాలుగు సంవత్సరాల నుంచి అతను మతిస్థిమితం కోల్పోయి బయట తిరగటంతో కొన్ని రోజుల నుంచి అతని తల్లితో పాటుగా కూలి పనికి తీసుకొని వెళ్లేది. ఆదివారం రోజు కూడా అలాగే తీసుకొని వెళ్లగా ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో ఆమె కూలీ పనిలో నిమగ్నమై ఉండగా గస్కుల నందు చేనులో ఉన్న ఏదో గుర్తుతెలియని పురుగులమందు తాగేశాడు. చికిత్స కోసం నిర్మల్ ఆస్పత్రికి తీసుకుని వెళ్లే మార్గమధ్యంలో మరణించాడు. మృతుని తల్లి రాధిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై సాయికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

దొరికిన సెల్ ఫోన్ అందజేత

నవతెలంగాణ-నార్నూర్



మండల కేంద్రంలో ఆదివారం ఉదయం గాంధీచౌక్ వద్ద షేక్ జావిద్‌కు సెల్ ఫోన్ దొరికింది. దొరికిన సెల్‌ఫోన్‌ను దాని యజమానికి అప్పగించాలనే ఉద్యేశంతో షేక్ జావిద్ సెల్‌ఫోన్‌ను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. వెంటనే పోలీసులు వివరాలు సేకరించి, సెల్‌ఫోన్ యజమాని అయిన గంగాపూర్ గ్రామానికి చెందిన రాథోడ్ రవీందర్‌ను పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై రవికిరణ్ చేతుల మీదుగా ఫోన్ అందజేశారు. మానవత్వంతో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఆయనకి అప్పగించడంతో షేక్ జావీద్‌ను పోలీసు సిబ్బంది అభినందించారు.

పీరీల షెడ్డుకు విరాళం

నవతెలంగాణ-బోథ్

మండలంలోని సొనాల గ్రామంలోని పీరీలకు తాత్కాలిక షెడ్డు కొరకు బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు సొనాల గ్రామ పీరీల ఉత్సవ కమిటీ కోరిక మేరకు ఆదివారం రూ.20వేలు కమిటీ సభ్యులకు విరాళాన్ని అందజేశారు. ఎమ్మెల్యేకు కమిటీ తరుపున అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు తుల సాగర్, వడ్ల లింగయ్య, చెట్లపల్లి రవికాంత్, వసంతరావు పటేల్, గట్కనారాయణ, మునేశ్వర్ సోమన్న, అమృత్‌రావు పాటిల్, కుమ్మరి సత్యనారాయణ, లోలపు పోశెట్టి, కే.సంతోష్, జై కిసాన్, బాల దేవన్న, రామాయి సదానందం, బోరికేపు రాజారాం, గడప రాజన్న, మోరుగు రమేష్, చాకలి ఆశన్న, కసిరి శ్రీనివాస్, కోస్మెట్టి మోహన్, చెట్ల పెల్లి భోజన్న, చెట్లపెల్లి లక్ష్మణ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-కడెం

మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ మైనార్టీ సీనియర్ నాయకులు ఎండీ కలీం సోదరుడు ఫరీద్‌హైమద్ ఆదివారం ఉదయం హైదరాబాద్ నుంచి తిరిగి కడెంకు వస్తున్న సమయంలో నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి వద్ద రోడ్డు ప్రమాదానికి గురై మరణించారు. విషయం తెలుసుకొని వారి నివాసానికి నిర్మల్ జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు అజ్మీరా శ్యామ్ నాయక్ వెళ్లి పార్థివ దేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి వెంట మండల బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఉన్నారు.

2న జిల్లాస్థాయి జావెలిన్ త్రో ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జాతీయ జావెలిన్ దినోత్సవం పురస్కరించుకొని ఆగస్టు 2న ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లా స్థాయి అథ్లెటిక్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడ్డి బోజారెడ్డి, రాజేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీలు అండర్-14, 16, 18, 20 బాల బాలికలతో పాటుగా పురుషులు, మహిళల విభాగంలో వేర్వేరుగా ఉంటాయని, పూర్తి వివరాలకు 9492146510 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రాజకీయ లబ్ధి కోసమే ఎంపీ వ్యాఖ్యలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదివాసీలు, లంబాడాల మధ్య చిచ్చుపెట్టి మరో మణిపూర్‌లా మార్చాలని ఎంపీ సోయం బాపురావు చూస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగ బద్ధ పదవిలో ఉండి లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని, ఎంపీ మాట్లాడటం సరికాదని అన్నారు. రాజకీయ లబ్ధి కోసమే ఎంపీ వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.

ముంపు కాలనీల్లో పర్యటించిన మాజీ ఎంపీ రాథోడ్ రమేష్

నవతెలంగాణ-ఖానాపూర్

ఇటీవల కురిసిన వర్షాలకు ఖానాపూర్ పట్టణంలోని పలు కాలనీలు జలమయమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో బీజేపీ నాయకులు రమేష్ రాథోడ్ ఆదివారం పలు కాలనీలను సందర్శించారు. ఖానాపూర్ పట్టణంలోని జేకేనగర్, రాజీవ్‌నగర్, విద్యానగర్, శ్రీరాంనగర్ కాలనీల్లో బీజేపీ నాయకులతో కలిసి పర్యటించారు. జేకే నగర్, రాజీవ్ నగర్ పై నుంచి వచ్చిన వరదలకు ముంపుకు గురి కావడంతో కాలనీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు నాయిని సంతోష్, మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శులు దేశాయ్ రాము, మామిడాల సుధాకర్, బీజేపీ సీనియర్ నాయకులు తోకల బుచ్చన్న, దాదే మల్లయ్య అంకం మహేందర్, సింహరాజుల ఆనంద్, పొలసాని అనిల్ రావు, లాండేరి కిషన్, లింబాద్రి, అంబటి రవి, కమలాకర్, గడ్డం రవీందర్, మైలరపు గంగాధర్, పరమేశ్వర్‌గౌడ్, జీవన్, బిన్నీ సావర్కర్, దాసరి రాజన్న, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రైతులకు తక్షణమే నష్ట పరిహారం చెల్లించాలి

నవతెలంగాణ-నిర్మల్

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, వారికి తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే బీజేపీ నాయకులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత 9సంవత్సరాలుగా ఏ ఒక్క రైతుకు కూడా పంట నష్ట పరిహారం అందించలేదని అన్నారు. స్థానిక మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి ప్రజల కంటే సొంత రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని మండిపడ్డారు. నష్ట పోయిన రైతులను పరామర్శించాల్సిందిపోయి పార్టీ కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించడం సిగ్గు చేటని అన్నారు. ఒక వైపు నిర్మల్ పట్టణంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అనాలోచిత నిర్ణయాల వల్ల పట్టణ సుందరీకరణ పేరుతో నాళాలను ధ్వంసం చేసి, వాటిపైనే ఫుట్‌పాత్‌లు నిర్మించి పట్టణాన్ని విధ్వంసం చేశారన్నారు. ఇక్కడ చిన్నపాటి వర్షానికే పట్టణం మునిగిపోవడం పాలకుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని అన్నారు. పంటనష్ట పోయిన రైతులకు తక్షణమే నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ధర్నా కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో పెద్దపల్లి జిల్లా ఇన్‌ఛార్జి రావుల రాంనాథ్, అదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్న గారి భూమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శులు మెడిసెమ్మ రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు అర్జున్, నాయకులు నారాయణ్‌రెడ్డి, బాపురెడ్డి జిల్లా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పొచమ్మను దర్శించుకున్న పీపీ, డీఎస్పీలు

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ప్రసిద్ధి పొందిన అడెల్లి శ్రీమహా పోచమ్మ ఆలయాన్ని ఆదివారం పబ్లిక్ ప్రాసిక్యూటర్ విశ్వాస్‌రెడ్డి, డీఎస్పీ గంగారెడ్డి, వారితో పాటు మంత్రి పర్సనల్ అసిస్టెంట్ శ్రీనివాస్, సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌లు పురుషోత్తం, శ్రీనివాస్, నవీన్ కుమార్, మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ హరీంద్రకుమార్, ఎస్సై కృష్ణా సాగర్‌రెడ్డిలు అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మెన్ అయిటి చందు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ రమణరావు, ఆలయ ధర్మ కర్తలు పురుషోత్తం రావ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి బాటలో అనార్‌పల్లి

- బాల వికాస్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు
- సామాజిక పొదుపుతో పేదలకు చేయూత
- గ్రామంలో నిఘా నేత్రాలు

నవతెలంగాణ-కెరమెరి



అనార్‌పల్లి గతంలో కరంజివాడ గ్రామ పంచాయతీ లోని గ్రామం. ఆ గ్రామంలోకి అడుగుపెడితే సమస్యలు స్వాగతం పలికేవి. మట్టిరోడ్లు, గుంతలదారులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. పెద్ద గ్రామ పంచాయతీ కావడంతో అంతంత మాత్రమే పనులు జరిగేవి. ఇదంత గతం..కొత్త గ్రామ పంచాయతీ ల ఏర్పాటు లో భాగంగా అనార్ పల్లి నూతన జీపీ గా ఏర్పాటైంది.దీంతో అభివృద్ధికి బాటలు పడ్డాయి. ప్రస్తుతం స్థానిక సర్పంచ్ రాథోడ్ శేషారావు విద్యావంతుడు కావడంతో ఆయన చొరవతో గ్రామ రూపురేఖలే మారిపోయాయి. పారిశుధ్య చర్యలతో గ్రామం సంపూర్ణ స్వచ్ఛత దిశగా అడుగులు వేస్తున్నది. గ్రామంలో ప్రకృతి వనం ఆహ్లాదం పంచుతుండగా.. హరితహారంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి కనువిందు చేస్తున్నాయి. అధికారులు, గ్రామస్తుల భాగస్వామ్యంతో గ్రామ అభివృద్దే ప్రధాన ఎజెండాగా జీపీ పాలకవర్గం పనిచేస్తున్నది. మారుమూల గ్రామం ఇప్పుడు అభివృద్ధిలో దూసుకుపోతున్నది. గ్రామంలో చేపట్టిన అభివద్ధి పనులు ఆదర్శవంతంగా నిలుస్తున్నాయి.

సామాజిక పొదుపు.... అభివద్ధి పనులు ఇలా



గ్రామంలో అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతున్నాయి.గ్రామస్తులు వ్యాధుల బారిన పడకుండా ఉండాలనే సంకల్పంతో శుద్ధ జలం అందించాలని నిశ్చయించుకొన్నారు. 2018 లో బాల వికాస్ స్వచ్ఛంద సంస్థ (ఎన్ జీవో) వారికి గ్రామ పంచాయతీ నిధుల నుండి 65 వేలు సమకూర్చగా, ఎన్‌జీవో వారు మినరల్ వాటర్ ప్లాంట్ ను అందజేశారు.గ్రామస్తుల సహకారంతో బోర్ వెల్ తవ్వించారు , బోర్‌వెల్‌తో పాటు ఇతర పరికరాలకు రూ.2.50లక్షలు వెచ్చించారు. 20లీటర్ల శుద్ధ జలానికి గ్రామస్తులు రూ.5 చొప్పున జీపీకి చెల్లిస్తున్నారు.గ్రామస్తుల సహకారంతో సామాజిక పొదుపుకు బాటలు వేశారు. అన్నదే తడవుగా 13లక్షలు పోగు చేశారు.వారి కుల ఆధ్యాత్మిక గురువు రాం రావు మహరాజ్ విగ్రహం, ఆలయ మరమ్మతుల కోసం 3.లక్షల 70లు వెచ్చించారు.మిగతా 10లక్షలు గ్రామస్తులంతా తమకు అత్యవసర సమయాల్లో సద్వినియోగం చేసుకొని కొత్త మొత్తం మిత్తి చెల్లిస్తారు. వచ్చిన డబ్బులను గ్రామ అభివద్ధి కోసం వినియోగిస్తున్నారు. 10 లక్షల వ్యయం తో 3 గదుల వాణిజ్య సముదాయాన్ని నిర్మించారు.మూడు గదుల్లో చిరు వ్యాపారులు వ్యాపారం చేస్తూ ఉపాధి పొందుతున్నారు. మూడు గదుల కిరాయి నెలకు 3000 రూ వస్తుండడం తో గ్రామ అభివద్ధికి ఖర్చు చేస్తున్నారు..గోలశాల హైదరాబాద్ వారితో సర్పంచ్ చర్చించి గ్రామంలో నిరు పేద ప్రజలకు 20 గేదెలను ఉచితంగా అందజేశారు. ఇప్పటికే గ్రామంలో పూర్తి స్థాయిలో నాలుగేళ్లలో 40 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు.

నిఘా నేత్రాల వలయంలో .....

గ్రామంలో ప్రస్తుతం అభివద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. గ్రామంలో ఎలాంటి సంఘటనలు, దొంగతనాలు చోటు చేసుకోకుండా సర్పంచ్ జాగ్రత్తలు తీసుకున్నారు. అందరి సహకారంతో రూ.60వేల తో ప్రధాన కూడళ్లలో 8సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు.దీంతో గ్రామానికి రక్షణ

అందరి సహకారంతో నే అభివద్ధి

-సర్పంచ్ రాథోడ్ శేషారావులి



అనార్ పల్లి లో మొత్తం జనాభా సుమారు1275 -మంది జనాభా ఉన్నారు.అందరి సహకారం ఉంటేనే ఏ గ్రామంలోనైనా అభివద్ధి సాధ్యపడుతుంది. అనార్ పల్లి కూడా ఇదే తరహాలో అధికారులు. ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అందరూ గ్రామ అభివద్ధి తమ వంతు సహకారాన్ని అందిస్తున్నారు. ఇప్పుడు గ్రామం ఇతర గ్రామాలకు అభివద్ధి లో ఆదర్శంగా నిలుస్తున్నది.

శ్రమదానంతో రోడ్డు వేసుకున్న రైతులు

నవతెలంగాణ-తలమడుగు



మండల కేంద్రానికి అనుకోని ఉన్న గుట్టకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని పలు మార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు, విన్నవించిన ఎవరు కూడా పట్టించుకోకపోవడంతో రైతులందరూ కలిసి ఆదివారం రోడ్డును శ్రమదానంతో రైతులు బాగు చేసుకున్నారు. రైతులు గుట్టపైన చిన్న సన్న కారు రైతుల భూములు దాదాపు 2 వేల ఎకరాల సాగు భూమి ఉన్నప్పటికీ రోడ్డు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. తాత ముత్తాతల నుండి భూములను సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుమన్నారు. గుట్టకు రోడ్డు నిర్మాణం లేకపోవడంతో మనుషులు పశువులు నడటానికి సైతం కష్టంగా ఉందని రైతులు తెలిపారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు అధికారులు రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు. కష్టపడి పండించిన పంటను ఇంటికి తెచ్చేందుకు కూడా రోడ్డు బాగా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు రైతులు తెలిపారు. మండల కేంద్రం నుంచి గుట్టపైకి రోడ్డు నిర్మాణం చేపట్టినట్టయితే చర్లపల్లి, ఝరి, సఖినాపూర్, భరంపూర్, పల్లి(కె) పల్లి(బి) గ్రామాల రైతులకు ఇటు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. కనీసం ఎడ్లబండి కుడా నడవలేని స్థితిలో రోడ్డు ఉండటంతో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణ పనుల్లో పాల్గొన్న రైతులు పిడుగు వెంకన్న, మర్రి విలాస్, మేకల సుధాం, స్వామి, మంతె లచ్చన్న , మంతె గంగారెడ్డి, సందీప్, లింగాల రాజారెడ్డి, గంగారెడ్డి, దాసరి లక్ష్మన్న, ఠాగూర్ కృష్ణయ్య రైతులు పాల్గొన్నారు.

మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలి

- మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహనీయుల ఆశయాలకు అనుగుణంగా వారు చూపిన బాటలో నడుస్తూ ఆదర్శవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పాటు పడాలని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. మహారాష్ట్రలోని సాంగ్లి జిల్లా వాటేగావ్‌లో ఆగష్టు ఒకటవ తేదిన జరగనున్న సాహిత్య సామ్రాట్ అన్నబావు సాటే 103వ జయంతి ఉత్సవాల్లో సీఎం కేసీఆర్ పాల్గొననున్న నేపథ్యంలో ఆదివారం జిల్లాకేంద్రం నుంచి పలువురు మాంగ్ కులస్థులు బయలుదేరివెళ్లారు. వీరి ప్రయాణానికి ఎమ్మెల్యే జోగు రామన్న సహకారం అందించారు. బస్‌ను మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహిత్య పితామహుడిగా కీర్తి సంపాదించిన సంఘసంస్కర్త అన్నాభావు సాతే స్వగ్రామంలో జరగనున్న జయంతి ఉత్సవాల్లో సీఎం కేసీఆర్ పాల్గొననున్నారని తెలిపారు. ఆదిలాబాద్ నుంచి మాంగ్ కులస్తులు వేడుకల్లో పాల్గొనేందుకు గానూ ఎమ్మెల్యే జోగు రామన్న తనవంతు సహకారాన్ని అందించారని పేర్కొన్నారు. పట్టణంలో అన్నబావు సాటే విగ్రహం వద్ద సుందరీకరణ పనులు సైతం పూర్తయ్యాయని పేర్కొన్నారు. రష్యా వంటి దేశాల్లోనూ అన్నబావు సాతే రచనలు ప్రచురించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో జిల్లా అన్నాభావు సాతే అసోసియేషన్ అద్యక్షులు కాంబ్లే ఉద్ధవ్, ఉపాధ్యక్షుడు నర్సింగ్ మోరే, నాయకులు వాసుదేవ్, అర్జున్, అనిల్, డికే జ్ఞానోబా, దయానంద్, జిల్లా ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రమోద్ ఖత్రి, ఉపాధ్యక్షులు బరాడి రాకేశ్ పాల్గొన్నారు.

లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాల్సిందేనని జిల్లా రాయి సెంటర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కేస్లాపూర్‌లోని దర్బార్ హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆదివాసీ సమన్వయకర్త సీడాం భీమ్‌రావ్‌తో పాటు పలువురు మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో బీసీలుగా ఉన్న లంబాడీలు, ఆదివాసుల హక్కులను కాల రాస్తున్నారని ఆరోపించారు. మరో వైపు మహారాష్ట్ర నుంచి అక్రమంగా జిల్లాలో వలస వచ్చి అనేక మంది ఇక్కడ ఉద్యోగాలు పొందుతున్నారని అన్నారు. ప్రభుత్వం వీరిని వెంటనే ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేని యెడల ఆదివాసుల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పలు అంశాలపై తీర్మానం చేశారు. ఆగస్ట్ 9న జరుగబోయే ప్రపంచ ఆదివాసుల దినోత్సవాన్ని లక్ష మందితో నిర్వహించుకుంటామని అన్నారు. కొందరు గిట్టని వారు ఎంపీ సోయం బాపురావుపై బురదజల్లే ప్రయత్నం చేస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. తుడుం దెబ్బ జిల్లా, మండల కమిటీని రద్దు చేస్తూ, తీర్మానం చేశారు. అనంతరం ఆదివాసుల ఆధ్వర్యంలో ముత్నూర్‌లోని కుమురం భీం చౌక్ వద్ద రాస్తారోకోను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎంపీ సోయం బాపురావుపై కొందరు గిట్టని వారు అనుచిత వాఖ్యలు చేయడం మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సార్మెడిలు చిన్ను పటేల్, వెంకట్‌రావ్ పటేల్, జుగాది పటేల్, వివిధ మండలాల నుంచి వచ్చిన ఆదివాసులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పరిశీలించిన మున్సిపల్ చైర్మెన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పెరుగుతున్న పట్టణ జనాభా, విస్తీర్ణానికి తగ్గట్లుగానే అన్నిరకాల వసతులు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. 2014 కంటే ముందున్న అనేక సమస్యలకు పరిష్కారం చూపి ప్రజల ఇబ్బందులు దూరం చేశామని అన్నారు. ఆదివారం పట్టణంలోని కైలాస్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న సమీకృత మార్కెట్ పనులను ఆదివారం ఆయన పర్యవేక్షించారు. నాయకులు రాంకుమార్, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందితో కలిసి పనులను పరిశీలించి, నిర్మాణ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. రూ.7కోట్ల ఇరవై లక్షల వ్యయంతో అయిదేకరాల విస్తీర్ణంలో నిర్మితమవుతున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేసేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, మార్కెట్ పనులను పూర్తి చేయాలనీ సూచించారు.

రైతు సమస్యలు పక్కదారి పట్టించే ప్రయత్నం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బాధిత రైతుల సమస్యలు పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తూ ఎమ్మెల్యే జోగు రామన్న, కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి పరస్పరం వ్యక్తిగత విమర్శలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాజకీయాలలో నాయకులు ఒకరిపై ఒకరు అభివృద్ధిపై విమర్శలు చేసకోవడం వరకు తప్పులేదని, కానీ ఇలా వ్యక్తి గత విమర్శలు చేసుకుంటూ ప్రజా సమస్యలను పక్కదారి పట్టించే విధంగా మీరు చేస్తున్న రాజకీయ డ్రామాను ప్రజలందరూ గమనిస్తూనే ఉన్నారని అన్నారు. మీ వల్ల ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో అలజడి సృష్టించి ప్రజలను ఇబ్బంది పడేలా చేస్తున్నారని అన్నారు. ఇకనైనా నాయకులు పద్దతి మార్చకొకపోతే ప్రజలు తగిన రీతిలో బుద్ది చెప్తారని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు నారాయణరెడ్డి, క్రాంతికుమార్, గన్నోజి విజయ్, కాంత, సబ్దార్, పవన్, శివ కిరణ్, రుతీక్ ఉన్నారు.

దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి

నవతెలంగాణ-సారంగాపూర్

దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి జరుగుతోందని అడెల్లి ఆలయ కమిటీ చైర్మెన్ అయిటి చందు అన్నారు. ఆదివారం సారంగాపూర్ మండలంలోని ప్రసిద్ధి గాంచిన అడెల్లి శ్రీ మహా పోచమ్మ ఆలయాన్ని మండలంలోని జామ్ గ్రామానికి చెందిన రామ్ సాయి కుమార్ సతీ సమేతంగా పోచమ్మ తల్లిని దర్శించుకొని ఆలయ అభివృద్ధికోసం రూ.10 వేల నగదును ఆలయ చైర్మన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి శ్రీనివాస్ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి తీర్ధ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. విరాళంగా దాత సాయి కుమార్ దపతులను చైర్మెన్ చందు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జామ్ గ్రామ ఉపసర్పంచ్ కర్పె విలాస్, ఆలయ సీనియర్ అసిస్టెంట్ రమణారావు, ఆలయ ధర్మ కర్తలు పురుషోత్తంరావు, ధేవాయి, సిబ్బంది పాల్గొన్నారు.

బూత్ జీతో అసెంబ్లీ జీతో

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలోని కంజర్ గ్రామంలో ఆదివారం బీజేపీ మండల కమిటీ సభ్యులు పర్యటించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ముఖ్యంగా బూత్ జీతో అసెంబ్లీ జీతో అనే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన ఫాసల్ భీమా యోజన గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమణ మాట్లాడుతూ ఈ పథకంలో తెలంగాణ ప్రభుత్వం భీమా యోజన కలిగించక పోవడంతో రైతులు అపార నష్టానికి గురవుతున్నారని పేర్కొన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీని ఎలా బలోపేతం చేయాలో కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ ఇన్‌చార్జీ అయ్యన్నగారి భూమయ్య, మండల అధ్యక్షులు పీసరి శైలేశ్వర్, దిలావర్‌పూర్ సర్పంచ్ విరేష్ కుమార్, కంజర్ సర్పంచ్ మధు, వినోద్, శ్యాం సుందర్ రెడ్డి, నరేష్, ముత్యం పాల్గొన్నారు.

బ్రిడ్జి మరమ్మత్తు పనులు ప్రారంభం

నవతెలంగాణ-లోకేశ్వరం

సుద్ధవాగు బ్రిడ్జి మరమ్మతు పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బ్రిడ్జి కింది భాగంలోని రివిట్మెంట్ కొట్టుకుపోవడంతో బ్రిడ్జి కూలిపోయే ఆస్కారం ఉండటంవల్ల అధికారులు బ్రిడ్జి మార్గంలో శుక్రవారం నుంచి రాకపోకలను నిలిపివేశారు. దీనితో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి బ్రిడ్జి సమీపంలో అదే రోజు ఆందోళన చేపట్టగా, సంబంధిత రోడ్డు భవనాల శాఖ అధికారులు బ్రిడ్జిని పరిశీలించి శనివారం నుండే మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చారు. కానీ ఒకరోజు ఆలస్యంగా ఆదివారం మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. కేవలం ద్విచక్ర వాహనాలను మాత్రమే బ్రిడ్జిపై నుంచి అనుమతించడం వల్ల లోకేశ్వరం మండల ప్రజలకు ప్రధాన రహదారి ఇదే కావడంతో, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీలైనంత త్వరలో మరమ్మతు పనులు పూర్తిచేసి బ్రిడ్జిపై నుంచి రాకపోకలను పునరుద్ధరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రెండు రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్

నవతెలంగాణ-నిర్మల్

సోమ, మంగళవారాల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్టు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ధన్‌రాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించడానికి ప్రతి మండలానికి ఒక జిల్లా స్థాయి ప్రత్యేక అధికారిని కలెక్టర్ నియమించారని తెలిపారు. అదేవిధంగా మండల స్థాయిలో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.వైద్యారోగ్య, పంచాయతీరాజ్, మున్సిపల్, శిశుసంక్షేమ, రెవెన్యూ శాఖల సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తారని తెలిపారు. దీనిలో భాగంగా ప్రతి ఇంటిని, ఇంటి పరిసరాలను సందర్శించి నీటి నిల్వలను పరిశీలించి, తొలగించడం జరుగుతుందని, నీరు నిల్వ ఉండటం వల్ల వచ్చే అనర్థాల గురించి, నష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. దీనితో పాటు జ్వర సర్వే నిర్వహించడం జరుగుతుందని, జ్వరంతో బాధపడుతున్న వారికి చికిత్స అందించడం జరుగుతుందని తెలియజేశారు. వరదల ప్రభావానికి గురి అయిన గ్రామాలలో వైద్యాధికారులచే ప్రత్యేక వైద్య ఆరోగ్య శిబిరాలను నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఆర్‌బిఎస్‌కే బృందంతో రెసిడెన్షియల్ పాఠశాలలలో వసతి గృహాల్లో విద్యార్థులను పరీక్షించి వ్యాధులతో బాధపడుతున్న వారికి చికిత్సలు అందించడం జరుగుతుందని తెలిపారు.